بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ     نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ     وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 02.06.2017 (TELUGU)**

**మీలో దైవభీతి కలుగుటకే రమజాన్ వచ్చునని అల్లాహ్ తఆలా తెలుపుట, దైవభీతి కొరకే అల్లాహ్ తఆలతీ సంస్థను స్థాపించెనని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం తెలిపిన దరిమిలా మన జీవితములలో రమజాన్ వచ్చుట మనపై ఒక గొప్ప భారమును మోపును. కనుక మనము అనుక్షణం మన స్థితులను పరిశీలించుకోవలెను. అల్లాహ్ తఆలా అందించిన ఈ ప్రత్యేక శుభముల రోజులలో మనము అల్లాహ్ తఆలా ఆశించిన విధముగా మనలో మార్పులు కలిగించుకోవలెను. తమ దైవభీతి ప్రామాణికములను పెంచుకొనుటకు ప్రయత్నించవలెను.**

*హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 02.06.2017 తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్, మార్డన్ లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ అల్‌బఖరహ్ అధ్యాయములోని 184వ సూక్తిని పఠించిరి.

يَاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا كُتِبَ عَلَيْكُمُ الصِّيَامُ كَمَا كُتِبَ عَلَى الَّذِيْنَ مِنْ قَبْلِكُمْ لَعَلَّكُمْ تَتَّقُوْنَ

అనగా ఓ విశ్వాసులారా! మీరు ధార్మికులు కావలమునని మీ కంటే పూర్వమున్న వారికి విధించబడినట్లే మీకును ఉపవాస నియమము విధించడినది.

మన జీవితములో మరో రమజాన్ రావడం మన అదృష్టమే. అల్‌హందులిల్లాహ్. రమజాన్ కొరకు స్వర్గమును నిశ్చయముగా సంవత్సరం మొదటి నుండి చివరి వరకు అలంకరించబడునని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉపదేశించిరి. మరో కథనములో ఇట్లు గలదు. విశ్వాస స్థితిలో, తమ ఆత్మ పరిశీలన చేసుకొంటూ రమజాన్ ఉపవాసములు పాటించిన వాని గత పాపములు క్షమించబడును, రమజాన్ శుభములు ఎంత గొప్పవో మీకు తెలిసినచో సం॥ పొడుగునా రమజాన్ యుండవలెనని మీరు ఆశింతురని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉపదేశించిరి.

విశ్వాస స్థితిలో, తమ ఆత్మ పరిశీలన చేసుకొంటూ రమజాన్ ఉపవాసములు పాటించడంతోనే ఈ స్థాయి లభించునని ఈ రెండవ హదీసులో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం స్పష్టం చేశారు. ఈ స్థితి ఏర్పడినప్పుడే గత పాపములు కూడ క్షమించబడును. వ్యక్తి విశ్వాసములో ప్రగతి చెందును. తన ఆత్మపరిశీలన చేసుకొనును, తమ బలహీనతలను గమనించును, తన కర్మలను చూడును, అల్లాహ్ హక్కులు, మానవుల హక్కుల చెల్లింపు గురించి ఆలోచించును. తన కర్మలను అల్లాహ్ తఆలా ఇష్టానుసారము మార్చుకొనుటకు ప్రయత్నించును. అప్పుడే పాపములు కూడ క్షమించబడును. రమజాన్ ఉపవాసములతో పొందవలసిన ఉద్దేశము ఇదేనని అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్‌ఆన్‌లో కూడ తెలిపెను. మీరు ధార్మికులు కావలయునని మీకును ఉపవాస నియమము విధించడినదని నేను సూక్తిని పఠించితిని. ప్రతి కార్యము అల్లాహ్ తఆలా ప్రీతి కొరకే చేయుట దైవభీతి అనబడును. అప్పుడే మీరు ఉపవాసములతో ప్రయోజనము పొందగలరు. షైతాన్ దాడుల నుండి రక్షింపబడుదురు. అల్లాహ్ తఆలా రక్షణ నుండి మానవుడు ఏ మాత్రం దూరమైనను ఆవహించుకొనుటకు షైతాన్ సిద్ధముగా యున్నదని షైతాన్ స్పష్టమైన సవాలు విసిరెను. కనుక విశ్వాసములో ప్రగతి, ఆత్మ పరిశీలన ద్వారనే ఒక వ్యక్తి అల్లాహ్ తఆలా శరణమును పొందవచ్చును. ధర్మమును పాటించినప్పుడే ఇది సాధ్యగమును.

విశ్వాస స్థితి, ప్రామాణికము, దైవభీతి స్థితి, ప్రామాణికము ఎలా యుండవలెనో, దానిని ఎలా పొందవచ్చునో మనకు తెలుపుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం అల్లాహ్ తఆలాను గుర్తించనంత వరకు విశ్వాస ఈ స్థితి లభించదని మనకు తెలిపిరి. ఇంకను వారిట్లనిరి. అల్లాహ్ తఆలాను గుర్తించడమే ఒక పెద్ద దశ. సరియైన రీతిలో, స్పష్టముగా అల్లాహ్ తఆలాను గుర్తించనిచో మన విశ్వాసము ఎన్నడు కాంతివంతము లేదా ప్రకాశవంతము కాదు. అల్లాహ్ తఆలాను ఎలా గుర్తించవచ్చును ? అల్లాహ్ తఆలా లక్షణము రహీమియ్యత్

(పరమకారుణ్యమూర్తి) ప్రకాశముతో ఇది సాధ్యగమును. అల్లాహ్ తఆలాతో ఎలా సంబంధము ఏర్పడవలెననగా ఇందులో అల్లాహ్ తఆలా రహీమియ్యత్, శుభము, శక్తి లక్షణములు మన అనుభవములో రావలెను. అల్లాహ్ తఆలాతో అసాధారణ సంబంధము ఏర్పడినప్పుడు ఈ విషయములు అనుభవములోకి రావచ్చును. ఇంకను వారిట్లనిరి. అల్లాహ్ తఆలా రహీమియ్యత్, శుభము, శక్తి వంటి లక్షణములు అనుభవములోకి వచ్చినప్పుడు అవి తుచ్ఛ కోరికల నుండి మోక్షము కలిగించును. విశ్వాస బలహీనత, బలహీన నమ్మకము వలన తుచ్ఛ కోరికలు కలుగును. విశ్వాసము బలహీనము కానిచో, అల్లాహ్ తఆలాపై సంపూర్ణ నమ్మకమున్నచో తుచ్ఛ కోరికలు పుట్టవు. మానవునికి పరలోక వరముల కంటే ఎక్కువ ఇహలోక సుఃఖములు, ఆస్తి పాస్తులు ఎంతో ప్రియమైనవి. ఎందుకనగా పరలోక వరములు కూడ అంతే ప్రియమైనచో ఇహలోక వస్తువులను పొందుటకు ఎంత ప్రయత్నించుచున్నాడో అంతే పరలోక వరములను పొందుటకు ప్రయత్నించును లేదా అంతకన్నా ఎక్కువ ప్రయత్నించును. కనుక అల్లాహ్ తఆలా శక్తి, రహీమియ్యత్, అతని వాగ్దానములపై నిజమైన నమ్మకము లేదని స్పష్టమైనది. ఈ విషయమును పరిశీలించవలసిన  అవసరమున్నది.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. విశ్వాసము ఏదో సామాన్యమైన విషయము కాదని ఈ వివరణ తరువాత చాలా స్పష్టమైనది. ఇదెంతో గొప్ప విషయము. ఎంతో గొప్ప లక్ష్యము మనకు విధించబడెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఒక చోట ఇట్లనిరి. అల్లాహ్ తఆలాపై విశ్వాసము రెండు రకాలుగా యుండును. ఒకటి కేవలం నాలుక వరకు మాత్రమే పరిమితమై యుండును. దాని ప్రభావము పనులు, కర్మలపై ఏమియును యుండదు. అల్లాహ్ తఆలాపై గల రెండవ విశ్వాసము ఎటువంటిదనగా దాని వెంట కర్మల సాక్ష్యము యుండును. ఈ రెండవ రకమైన విశ్వాసము ఏర్పడనంత వరకు నేను అల్లాహ్ తఆలాను నమ్ముచున్నానని మానవుడు అనలేడు. ఒక వైపు అల్లాహ్ తఆలాను నమ్ముచు మానవుడు పాపము ఎలా చేయగలడో నాకు అర్థము కాదు. ప్రపంచములోని అధిక భాగము మొదటి రకమును నమ్మును. ఒక వైపు మేము అల్లాహ్ తఆలాను నమ్ముతామని అంగీకరించుచు మరో వైపు ప్రపంచ పాపములలో నిమగ్నమై, పాప మలినములతో కలుషితమైనారని నాకు తెలుసు. అతన్ని ఉపస్థితునిగా, చూచువానిగా నమ్మి కూడ ఏర్పడని ఆ ప్రత్యేకత ఏమిటి? ఒక వస్తువును నమ్మి దాని నష్టము నుండి దూరముండుట, దాని లాభములను పొందగోరుట మానవుని విశిష్టత. సంఖియా అను విషమును కొద్ది మోతాదులో మ్రింగినను ప్రాణము పోతదని అతనికి తెలుసు. అందుకే దానిని మ్రింగుటకు అతడు సాహసించడు. కనుక అల్లాహ్ తఆలాను నమ్మిన తరువాత విశ్వాస ఫలములను పొందుటకు ఎందుకు ముందుకు రాడు. సంఖియాకు సమానంగా కూడ అల్లాహ్ తఆలాను నమ్మినచో అతని కోరికలు, ఉద్రేకములు చనిపోవును. కాని అలా జరగడం లేదు. కనుక అల్లాహ్ తఆలాపై గల నమ్మకమును మొదట సరిదిద్దుకొనుట అతని ప్రథమ బాధ్యత. అనగా దానిని తన కర్మలతో నిరూపించి చూపవలెను. అల్లాహ్ తఆలా వైభవమునకు, అతని ఆదేశములకు విరుద్ధముగా అతని ద్వారా ఎటువంటి కార్యము, కర్మ సంభవించకూడదు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇది ఒక విశ్వాసి ఆత్మ పరిశీలన పద్ధతి. రమజాన్ నెలలో ఒక ప్రత్యేక వాతావరణము ఏర్పడును. ఆరాధనలు, పుణ్యముల వైపు శ్రద్ధ ఏర్పడును. ఇటువంటి వాతావరణములో ఆరాధనలు, పుణ్యముల వైపు శ్రద్ధ వహించుచు తమ కర్మలను పరిశీలించుకొంటూ మనము మన అల్లాహ్ తఆలా ఆస్థానములో మోకరిల్లుచు తమ గత పాపముల పట్ల క్షమాపణ కోరవలెను. అనంతరం ఈ రమజాన్‌ను మిగతా జీవితములో భాగముగా మార్చుకోవలెను.

విశ్వాస స్థితి, ఆత్మ పరిశీలన చేసుకొంటూ రమజాన్ గడపవలెనని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపినారనగా దైవభీతిలో ప్రగతి చెందుచు తమ స్థితులను అల్లాహ్ తఆలా ఇష్టానుసారముగా మార్చుకొంటూ ఈ రోజులను గడపమని అర్థము. దీని నుండి విజయవంతముగా ముందుకెళ్లినచో దైవభీతి జీవిత శాశ్వత భాగమగును. రమజాన్‌లో మాత్రమే వ్యక్తి తన స్థితులను చక్కదిద్దుకోక ఈ ప్రయోజనము సదా కొనసాగును. ఇటువైపు మన దృష్టి మరల్చుచు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇట్లనిరి. ఖుర్ఆన్, ఇస్లామీయ బోధన ఉద్దేశము దైవభీతి కలిగించుటయే. కాని ఇదే నేడు మనకు కనిపించడం లేదు. ఉపవాసములు యుంటారు, నమాజులు సలుపుతారు కాని దైవభీతి లేనందున ఈ నమాజులే, ఉపవాసములే వారిని పాపిష్టులుగా మార్చుచున్నవి.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఇస్లాం నామమున నేడు మనము ఉగ్రవాదమును చూచుచున్నాము. అమాయకులు

హత్య చేయబడుచున్నారు. ఇదంతా దవైభీతి లేనందునే జరుగుచున్నది. దైవ భీతి లేనివారి ఇటువంటి వారికి రమజాన్ ఎలా లబ్ది చేకూర్చును. అల్లాహ్ తఆలా, అతని ప్రవక్త పేరున హింసకు పాల్పడుచున్న వారు ఎన్నడు రమజాన్ నుండి ప్రయోజనము పొందలేరు. అల్లాహ్ తఆలా వారిని తప్పక శిక్షించును. నేడు హింస, దౌర్జన్యముతో ఈ సంఘటనలను విని, చూచిన తరువాత ఈ క్రూరుల నుండి దూరముంచి హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)ను నమ్మే అనుగ్రహము కల్పించినందున అహ్మదీయులమైన మనము గతము కంటే ఎక్కువ క్షమాపణలు యాచించుచు, అల్లాహ్ తఆలాను ప్రశంసించుచు తమ కర్మలను పరిశీలించుకొంటూ తమ విశ్వాసమును దృఢపరచుకొనుటకు కలత చెందవలెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇట్లనిరి. విశ్వాసమునకు మూలము దైవభీతి, పవిత్రత. దీనితోటే విశ్వాసము మొదలగును. దీని ద్వారనే ఇది పెరుగును. తుచ్ఛ కోరికలు నలిగిపోవును. దైవభీతి లేనిదే విశ్వాసము ఏర్పడదని వారి ఈ ఉపదేశముతో మరింత స్పష్టమైనది. విశ్వాసమునకు మూలము దైవభీతి మాత్రమే కాదు విశ్వాస రక్షణ, పెరుగుదల కూడ దైవభీతి లేనిదే సాధ్యము కాదు. దైవభీతి యున్నచో సత్కర్మలు సంభవించును. సత్కర్మలు యున్నచో, అల్లాహ్ తఆలా ఇష్టానుసారమున్నచో విశ్వాసము పెరుగును. దవైభీతిలో పెరుగనిదే రమజాన్ ప్రాముఖ్యత ఫలములు కూడ లభించవని దీనితో స్పష్టమైనది. దవైభీతి పెరిగినచో విశ్వాసము పెరుగును. ఆత్మ పరిశీలన జరుగును. ఆత్మ పరిశీలన వైపు దృష్టి యున్నచో మానవుడు తనను తాను పరిశీలించుకొనును. తుచ్ఛ కోరికలు కూడ నలిగిపోవును. తుచ్ఛ కోరికలు నలిగిన తరువాత అల్లాహ్ తఆలా ఆదేశములను పాటించినచో అతని సామీప్యము లభించును.

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇట్లనిరి. ఏ దైవభీతి కొరకు ప్రవక్తలు అవతరిస్తారో, మానవుడు పవిత్రుడు, పరిశుభ్రమవుతాడో అది ప్రపంచము నుండి అదృశ్యమైనది. పవిత్రత, పరిశుభ్రత ఎంతో మేలైనది. మానవుడు పవిత్రుడు, పరిశుభ్రుడు అయినచో దేవదూతలు అతనితో కరచాలనం చేయుదురు. ప్రజలలో వీటికి ప్రాధాన్యత లేదు. వాస్తవానికి వీటి రుచులలోని ప్రతి వస్తువు ధర్మబద్ధ మార్గములతో వారికి లభించును. ఇంకను వారిట్లనిరి. విశ్వాసి అయినంత వరకు ఒక దొంగ దొంగతనము చేయడు. ఇదెంతో నిజమైన విషయము. మేక తలపై పులి నిలబడినచో మరొకరి చేను తినడం అటుంచితే ధర్మబద్ధమైనదానిని కూడ తినడం మరచిపోవును. ఇదే విధముగా అల్లాహ్ తఆలా భయమున్నచో పాపము చేయడం సాధ్యము కాదు. దైవభీతియే అసలైన ఉద్ధేశము, మూలము. ఇది లభించిన వ్యక్తి సర్వమును పొందును. ఇది లేనిదే చిన్న, పెద్ద పాపముల నుండి మానవుడు తప్పించుకోలేడు. మానవుడు తనను తాను ఒంటరిగా భావించి పాపము చేయును. దేవుడు నన్ను చూడడం లేదని భావించినప్పుడే తనను తాను ఒంటరిగా భావించును. అనగా అతడు నాస్తికుడగును. అప్పుడతడు నా దేవుడు నాతో యున్నాడు, నన్ను చూస్తున్నాడని భావించడు. భావించినచో అతడెన్నడు పాపము చేయడు. ప్రతి విషయము దైవభీతిపై ఆధారపడియున్నది. దీని నుండే ఖుర్ఆన్ ప్రారంభించెను. ایاک نعبد وایاک نستعین۔ తో దైవభీతియే ఉద్దేశము. మానవుడు పని చేయును కాని భయము వలన దానిని తనకు అంటగట్టడానికి సాహసించడు. దానిని దేవుని సహాయమని భావించును. ایاک نستعین۔ అని నీ సహాయముతోనే ఈ ఆరాధన చేస్తున్నాను, నీ అనుగ్రహముతోనే ఈ ఆరాధన చేస్తున్నాను, లేనిచో ఈ ఆరాధన చేయలేనని అనును. ఆరాధన చేయుటకు అల్లాహ్ తఆలా ముందు కూడ అనుగ్రహించాలని భవిష్యత్తు కొరకు సహాయము యాచించును. దైవభీతి ప్రామాణికము ఇది. రెండవ అధ్యాయము కూడ ھدی للمتقین తోనే ప్రారంభమైనది. మానవుడు ధర్మబద్ధుడు అయినప్పుడే ప్రార్థన, ఉపవాసము, దానము మొIIనవి ఆమోదించబడును. ధర్మబద్ధత యున్నచో ఇవి ఆమోదించబడును. ధర్మబద్ధత లేనిచో ఇవి ఆమోదించబడవు. ఇంకను వారిట్లనిరి. పవిత్ర ఖుర్ఆన్‌లో ఒక సూక్తి గలదు. اِنَّ الَّذِیۡنَ قَالُوۡا رَبُّنَا اللّٰہُ ثُمَّ اسۡتَقَامُوۡا تَتَنَزَّلُ عَلَیۡہِمُ الۡمَلٰٓئِکَۃُ اَلَّا تَخَافُوۡا وَلَا تَحۡزَنُوۡا۔ దీని ఉద్దేశము కూడ దైవభీతియే. అనగా అల్లాహ్ మా పోషకుడని చెప్పిన తరువాత స్థిరత్వంతో ఈ విశ్వాసముపై నిలిచినవారు. అల్లాహ్ మా పోషకుడు, అతడే మా అసవరాలను తీర్చును. అతడే మమ్ములను పోషించును. మీ గత కర్మల గురించి మీరు భయపడకుము, ఇప్పుడు మీరు దైవభీతిని అవలంభించినందున మీరు భయపడకుమని సందేశమందించుచు వారిపై దేవదూతలు అవతరింతురు. نحن اولیاء کم فی الحیوۃ الدنیا وفی الاخرۃ۔ ఇహపరలోకములో మేము మీకు మిత్రులము, పోషకులమని ముందట గలదు.

స్థిరత్వముతో పుణ్యములను ఆచరించువారి పాపములను అల్లాహ్ తఆలా క్షమించును. ఇంత వరకే కాక వారికి ఇహలోక వరములు కూడ ప్రసాదించబడును. పరలోకములో కూడ దేవుడు మిత్రునిగా, పోషకునిగా

యుండును. స్థిరత్వముతో అల్లాహ్ తఆలా ఆదేశములను పాటించుచు తమ జీవితములను గడుపువారు, తమ స్థితులను మార్చుకొనుటకు మనలోని ప్రయత్నించువారు ఎంతో అదృష్టవంతులు.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. దేవుని అనన్య శుభముల ద్వారములు మన కొరకు తెరుచుకొనుటకు అల్లాహ్ తఆలా మనలను నిష్టాపరులుగా చేయదలచెను. రమజాన్‌లో ప్రత్యేకంగా అల్లాహ్ తఆలా తమ శుభముల ద్వారములను దైవభీతిని అవలంభించువారి కొరకు తెరుచును. నిష్టాపరుడగుటకు కేవలం పాపములను వీడుటయే కాక పుణ్యములు కూడ చేయవలసి యుండును. దీనిని వివరించుచు హ్రజత్ మసీహ్ మౌవూద్ (అ) ఇట్లనిరి. నిష్టాపరుడగుటకు పెద్ద పెద్ద విషయములు అనగా వ్యభిచారము, దొంగతనము, ఇతరుల హక్కులను హరించుట, దర్పనము, అమర్యాద, లోభితనము వంటి వాటిని పూర్తిగా వీడవలెను. ఈ నీచ ప్రవర్తనలను వీడి వీటి బదులు సద్గుణములలో ప్రగతి చెందవలెను. ప్రజలతో మృదుత్వము, సత్ప్రవర్తన, సహానుభూతితో వ్యవహరించవలెను. అల్లాహ్ తఆలాతో నిజమైన విశ్వసనీయత, సత్యమును చూపవలెను. సేవ చేయుటకు మంచి అవకాశములను అన్వేషించవలెను. ఈ విషయములతో మానవుడు నిష్టాపరుడనబడును. ఈ విషయములు కలిగియున్న వారే నిజమైన నిష్టాపరులు అనబడుదురు. సమస్త మంచి అలవాట్లు లేక ఒక్కొక్క మంచి అలవాటు ఒకరిలో యున్నచో అతడు నిష్టాపరుడు అనబడడు. ఇటువంటి వ్యక్తుల కొరకే అల్లాహ్ తఆలా لاخوف عليهم ولا هم يحزنون అని చెప్పెను. అనంతరం వారికి ఏ అవసరమం మిగులును. అల్లాహ్ తఆలా وهو يتولى الصلحين తెలిపినట్లు ఇటువంటి వారికి అల్లాహ్ తఆలా స్వయముగా పోషకునిగా మారును.

హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. బైఅత్ మాత్రమే చేసి అల్లాహ్ తఆలా శిక్ష నుండి తప్పుకోదలచినవారు తప్పు చేయుచున్నారు. మనసు వారిని మోసము చేసెను. ఎంత మోతాదులో వైద్యుడు రోగికి మందు ఇవ్వదలచినాడో అంత మోతాదులో రోగి త్రాగనిచో స్వస్థత ఎలా కలుగును. దేవుని ప్రకోపము నుండి రక్షించునంత వరకు పవిత్రత ఏర్పరచుకొని, దైవభీతిని అవలంభించుకొనుము. క్షమాపణ కోరువారిని అల్లాహ్ తఆలా కరుణించును. ఇలా కానిచో ప్రపంచములో అంధకారము రాజ్యమేలును. మానవుడు నిష్టాపరుడు అయినప్పుడు అల్లాహ్ తఆలా అతని, అతనికెదురుగా యున్న వ్యక్తిలో వ్యత్యాసము ఏర్పాటు చేయును. మన జమాఅత్ లో భక్తి కలుగవలెను. అల్లాహ్ తఆలా ఆశించిన విధముగా నిష్టాపరత యున్నవారు రక్షించబడుదురు. దైవభీతి మైదానములో ఖాళీగా యున్నందున ఈ సంస్థను అల్లాహ్ తఆలా దైవభీతి కొరకే స్థాపించాడు. హుజూరె అన్వర్ ఇట్లనిరి. మీలో దైవభీతి కలుగుటకే రమజాన్ వచ్చునని అల్లాహ్ తఆలా తెలుపుట, దైవభీతి కొరకే అల్లాహ్ తఆలా ఈ సంస్థను స్థాపించెనని హ్రజత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం తెలిపిన దరిమిలా మన జీవితములలో రమజాన్ వచ్చుట మనపై ఒక గొప్ప భారమును మోపును. కనుక మనము అనుక్షణం మన స్థితులను పరిశీలించుకోవలెను. అల్లాహ్ తఆలా అందించిన ఈ ప్రత్యేక శుభముల రోజులలో మనము అల్లాహ్ తఆలా ఆశించిన విధముగా మనలో మార్పులు కలిగించుకోవలెను. తమ దైవభీతి ప్రామాణికములను పెంచుకొనుటకు ప్రయత్నించవలెను. రమజాన్ వరకు మాత్రమే పరిమితము కాక జీవితములోని శాశ్వత భాగములుగా చేసుకోవలెను. అల్లాహ్ ఇందుకు మనందరిని అనుగ్రహించుగాక!

ఖుత్బా జుమా చివరలో హుజూరె అన్వర్ గా॥ ఖ్వాజా అహ్మద్ హుసేన్ దర్వేష్ ఖాదియాన్ గారి పరోక్ష అంత్యక్రియ ప్రార్థన చదివితునని ప్రటికించి, వారి సద్గుణములను ప్రస్తావించిరి. ☆ ☆ ☆

BOOK POST (PRINTED MATTER)

To,

..........................................................................

..........................................................................

..........................................................................